సాక్షి
సిద్దిపేట
గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



అధికారుల నిర్లక్ష్యమే..

పంటల సాగుపై రైతులకు అవగాహన కొరవడుతోంది. అధికారులు సైతం దృష్టి సారించడంలేదు. వివరాలు 8లో ▸



శివాజీ జయంతి ఉత్సవాల్లో..

వర్గల్ మండలం జబ్బాపూర్‌లో జరిగిన శివాజీ జయంతి ఉత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. వివరాలు 8లో ▸



నీటిని విడుదల చేయాలని..

రంగనాయక సాగర్ ప్రాజెక్టు నుంచి సాగు నీరు విడుదల చేయాలంటూ రైతులు ఆందోళనకు దిగారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



వంట గదిని పరిశీలిస్తున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. జిల్లా జైలును న్యాయమూర్తి బుధవారం సందర్శించారు. ఖైదీల వంట గది, స్టోర్ రూమ్ పరిశీలించి, ఖైదీలకు కల్పిస్తున్న భోజన వసతుల గురించి జైలు సూపరింటెండెంట్ వికాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. న్యాయమైన సలహాలు, సూచనల కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్ సంప్రదించాలని తెలిపారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వారానికి నాలుగు సార్లు జైలును సందర్శిస్తారని తెలిపారు. పోలీసులు అరెస్టు చేసే సమయంలో తప్పనిసరిగా మెడికల్ టెస్టు చేయించాలన్నారు. బెయిలబుల్ ఆఫెన్స్ కేసులో పోలీసు స్టేషన్ ష్యూరిటీలను సమర్పించి బెయిల్ పొందవచ్చని తెలిపారు.

అధిక కేసులు పరిష్కారం కావాలి



మాట్లాడుతున్న జడ్జి కృష్ణతేజ్

హుస్నాబాద్: జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధికంగా కేసులు పరిష్కారం అయ్యేలా పోలీసులు కృషి చేయాలని అదనపు సివిల్ కోర్టు జడ్జి కృష్ణతేజ్ అన్నారు. వచ్చే నెల 8న నిర్వహించే లోక్‌అదాలత్ నేపథ్యంలో బుధవారం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. జడ్జి కృష్ణతేజ్ మాట్లాడుతూ కేసులతో కక్షిదారులు సమయం, డబ్బు వృథా చేసుకుంటున్నారని తెలిపారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. కక్షిదారులకు అవగాహన కల్పించి అధిక కేసులు పరిష్కరించుకునేలా కృషి చేయాలన్నారు.

తెలుగు డీటీపీ కోర్సు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో తెలుగు డీటీపీ ఫొటోషాప్ సర్టిఫికెట్ కోర్సును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి కోర్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ సంపత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కోర్సు 30 రోజుల పాటు నిర్వహిస్తామని, తరగతులు వింటూనే సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు హరీష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: ప్రజలు ఇంటి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. పన్నుల వసూళ్లపై బుధవారం బిల్ కలెక్టర్లతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు ఇంటి పన్నులు తప్పకుండా చెల్లించాలన్నారు. వందశాతం పన్నులు వసూలు చేయాలన్నదే లక్ష్యమని తెలిపారు. పన్నులు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తే చట్ట ప్రకారం ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కనకయ్య, బిల్ కలెక్టర్లు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లోని ఎడ్యుకేషన్ హబ్‌లలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి తెలిపారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌ను యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవితో కలిసి బుధవారం పరిశీలించారు. ఉపాధ్యాయులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ ఎడ్యుకేషన్ హబ్‌లు సమస్యల నిలయాలుగా మారాయని, కనీసం వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయలేని దుస్థితి గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం హబ్‌లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

మా బతుకేంగావాలి



భూములు లాక్కోవద్దు.. ‘రోడ్డు’పాలు చేయొద్దు



వంద ఫీట్లకు కుదించాలని ఎన్‌హెచ్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు (ఫైల్)

‘ఎవుసమే మా ప్రాణం.. ఏళ్లుగా భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం.. మా భూములు లాక్కోవద్దు.. విస్తరణ పేరుతో ‘రోడ్డు’న పడేయవద్దు..’ అంటూ రైతులు వేడుకుంటున్నారు. కొన్ని చోట్ల సర్వేకు వచ్చిన అధికారులను సైతం అడ్డుకుంటున్నారు. 365బీ జాతీయ రహదారి విస్తరణపై రైతులు గగ్గోలు పెడుతున్నారు. దుద్దెడ నుంచి సిరిసిల్ల వరకు 365 బీ జాతీయ రహదారిని విస్తరిస్తున్నారు. ఇందుకోసం రూ.1,100 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే పలు చోట్ల సర్వేను నిర్వహించి మార్కింగ్ చేశారు. జనగామ నుంచి దుద్దెడ వరకు 100ఫీట్లు ఉన్న మాదిరిగానే సిరిసిల్ల వరకు కూడా అలాగే విస్తరించాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో 31 కిలో మీటర్ల మేర (దుద్దెడ నుంచి జక్కాపూర్) నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

365బీ జాతీయ రహదారి విస్తరణపై రైతుల గగ్గోలు

- భూమిపోతే ‘రోడ్డు’న పడతాం అంటూ ఆవేదన
- వంద ఫీట్లకే కుదించాలంటూ వినతులు
- బహిరంగ మార్కెట్ ధర చెల్లించాల్సిందేనంటూ పట్టు
- ఇప్పటికే పలుచోట్ల సర్వే అడ్డగింత
- జిల్లాలో దుద్దెడ నుంచి జక్కాపూర్ వరకు నిర్మాణం

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో దుద్దెడ నుంచి జక్కాపూర్ వరకు 31 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. ఇందులో భాగంగా 21 కిలోమీటర్ల నూతన రోడ్డు కోసం భూమిని సేకరించనున్నారు. పంట పొలాల మీదుగా రోడ్డు ఉండనుంది. మొత్తంగా పాత రోడ్డును 10 కిలోమీటర్లు విస్తరిస్తూ 21 కిలోమీటర్లు నూతన రోడ్డు కోసం సుమారు 210 హెక్టార్ల భూమిని రైతులు కోల్పోతున్నారు. భూమి సేకరణ దిశగా జాతీయ రహదారుల అధికారులు చర్యలు చేపడుతున్నారు. దుద్దెడ, జప్తినాచారం, నాగిరెడ్డిపల్లి, మార్పడగ, కంభంపల్లి, ఎన్సాన్‌పల్లి, తడ్కపల్లి, బూర్గుపల్లి, ఇర్కోడ్, చిన్నగుండవెల్లి, రాఘవాపూర్, పుల్లూరు, మల్యాల, జక్కాపూర్ మీదుగా జాతీయ రహదారి సాగనుంది. ఇందుకు భూ సర్వే చేస్తున్నారు.

నష్టపోతున్న రైతులు

150 ఫీట్ల రోడ్డుతో ఫోర్‌లేన్ల నిర్మాణం చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు. జనగామ నుంచి దుద్దెడ వరకు 100 ఫీట్ల వెడల్పుతో ఉన్న రోడ్డును దుద్దెడ నుంచి జక్కాపూర్ వరకు 150ఫీట్లకు పెంచారు. దీంతో కొందరు రైతులు మొత్తం భూమిని కోల్పోతుండగా మరి కొందరు సగం కంటే ఎక్కువగా నష్టపోనున్నారు. కొన్నేళ్ల నుంచి సాగు చేస్తున్న భూమి దక్కకుండా పోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. అలాగే పలు చోట్ల ప్రస్తుతం ఉన్న రోడ్డుకు అనుబంధంగా కొత్త రోడ్డు కోసం భూ సేకరణ చేస్తుండటంతో రైతులు మరింత నష్టపోతున్నారు.



సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరులో సర్వే చేస్తున్న అధికారులు

బహిరంగ మార్కెట్ ధర చెల్లించాల్సిందే..

జాతీయ రహదారి వెళ్లే మార్గంలో గతంలోనే బహిరంగ మార్కెట్ ధర ఎకరానికి రూ.45 లక్షల నుంచి రూ.60లక్షలు ఉంది. కానీ ప్రభుత్వం భూ సేకరణకు ఎకరానికి రూ.12 లక్షల నుంచి రూ.18 లక్షలు ఇచ్చే అవకాశాలున్నాయి. దీంతో రైతులు ఒక్కో ఎకరానికి లక్షలాది రూపాయలు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బహిరంగమార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వంద ఫీట్లలోనే నిర్మించాలి



గతంలో రోడ్డు విస్తరణ కోసం 12గుంటల భూమి కోల్పోయాను. ఇప్పుడు జాతీయ రహదారి కోసం భూమి మధ్యలోంచి వెళ్తందని చెబుతున్నారు. దీంతో మరో 1.05ఎకరాల భూమి పోతుందని తెలుస్తోంది. రోడ్డు వద్దనడం లేదు. ఉన్న రోడ్డుకు అనుబంధంగా 100ఫీట్ల రోడ్డునే నిర్మించాలి. 150 ఫీట్లు వద్దు. భూమి నష్టపోకుండా జాతీయ రహదారిని నిర్మించాలి.

\- రామచంద్రారెడ్డి, దుద్దెడ

భూమి పోతే.. రోడ్డున పడతాం



కష్టం చేసి 2.13 ఎకరాల భూమి కొనుగోలు చేశాను. రోడ్డు పేరుతో రెండు ఎకరాల భూమి పోతుందని తెలిసింది. మిగిలింది 13గుంటలే. అది కూడా అటు సగం.. ఇటు సగం ఉంటుంది. భూమి పోతే మా కుటుంబం రోడ్డున పడుతుంది. నా కూతురు పెళ్లి కోసం అమ్ముదాం అనుకున్నా. ఇప్పుడు భూమి పోతే నా కూతురి పెళ్లి ఎలా చేయాలి. ప్రాణం పోయినా భూమి ఇవ్వను.

-దాసరి యాదగిరి, జప్తినాచారం

మార్కెట్ ధర అమలు చేయాలి



1.03 ఎకరాల భూమి ఉంది. రహదారి కింద దాదాపు 30 గుంటలు పోయే అవకాశం ఉంది. ప్రస్తుతం మా దగ్గర ఎకరం రూ.80లక్షలకు పోతుంది. మాకు ఎలాంటి సమాచారం లేకుండానే కొలతలు పెడుతున్నారు. బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలి. లేదంటే భూమికి భూమి ఇవ్వాలి. భూమి కోల్పోతే జీవనం కష్టమవుతుంది.

\- ఆకుల శ్రీకాంత్, రైతు, ఎన్సాన్‌పల్లి

అప్పుడు మల్లన్నసాగర్..



తొగుట మండలం బ్రాహ్మణ బంజరుపల్లిలో 7ఎకరాల భూమి, ఇల్లు ఉండేది. మల్లన్నసాగర్‌లో భూమి, ఇల్లు పోయింది. వచ్చిన పరిహారంతో ఎన్సాన్‌పల్లిలో 20 గుంటల వ్యవసాయ భూమిని రూ.30 లక్షలు పెట్టి 2020లో కొనుగోలు చేశాం. ఈ భూమిలో మళ్లీ రోడ్డు కోసం అధికారులు కొలతలు పెడుతున్నారు. ప్రభుత్వం మాకు పూర్తి న్యాయం చేయాలి.

\- తోట సుజాత, రైతు, ఎన్సాన్‌పల్లి

ట్రాఫిక్ దృష్ట్యా 150 ఫీట్లకు పెంచాం



హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు వెళ్లే దారిలో ట్రాఫిక్ పెరుగుతుండటంతో 150ఫీట్ల వెడల్పుతో నిర్మించాలని నిర్ణయించాం. పైగా రోడ్డు వంకలు ఉండటంతో కొత్తగా రహదారి నిర్మించనున్నాం. సర్వే కొనసాగుతోంది. ఇది పూర్తి కాగానే రెవెన్యూ ద్వారా నోటీసులు జారీ చేసి నష్టపరిహారం అందజేస్తాం.

\- అన్నయ్య, డీఈఈ, జాతీయ రహదారులు

తెలంగాణపై చిన్నచూపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎమ్మెల్యే వంశీకృష్ణ
- గజ్వేల్‌లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం

గజ్వేల్: తెలంగాణ పట్ల కేంద్రప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆరోపించారు. బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వంశీకృష్ణ మాట్లాడుతూ బీజేపీ తీరుపై మండిపడ్డారు. తెలంగాణ రావాల్సిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యా సంస్థలను గుజరాత్‌కు తరలించుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీ రెండు కోట్ల ఉద్యోగాల కల్పన కలగానే మిగిలిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పట్టభద్రుల ఎన్నికల సమన్వయకర్త గుత్తా అమిత్ రెడ్డి, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి నీలం మధు, కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలు నింపండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు

సిద్దిపేటఅర్బన్: జిల్లాలోని చెరువులు, కుంటలను రిజర్వాయర్ల నీటితో నింపి సాగు నీటిని అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేటలోని కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, తాగునీటికి సైతం ఇబ్బందులు లేకుండాచూడాలన్నారు. జిల్లా ప్రజల అవసరాలు తీరిన తర్వాతే ఇతర జిల్లాలకు నీటిని తరలించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలస్వామి, శశిధర్, ఎల్లయ్య, సత్తిరెడ్డి, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చుక్క రాములు

లక్ష్యం మేరకు రుణాలివ్వండి

లీడ్ జిల్లా మేనేజర్ హరిబాబు

గజ్వేల్‌రూరల్: బ్యాంకు అధికారులు లక్ష్యాల మేరకు రుణాలివ్వాలని లీడ్ జిల్లా మేనేజర్ హరిబాబు సూచించారు. పట్టణంలోని ఐటీసీలో బుధవారం నాబార్డు డీడీఎం నిఖిల్‌రెడ్డి, డీఆర్‌డీఏ డీపీఎం విద్యాసాగర్, ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ రాజలింగంలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ, పీఎం స్వానిధి, పీఎంఎఫ్ఎంఈతో పాటు స్వయం సహాయక బృందాల పురోగతి, బ్యాంకు శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాలను నెలాఖరులోగా క్లియర్ చేసేలా చూడాలన్నారు. అర్హత కలిగిన రైతులకు వ్యవసాయ రుణాలను అందించాలని సూచిస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో గజ్వేల్ బ్లాక్ పరిధిలోని బ్యాంకుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

భోజనంలో మెనూ తప్పనిసరి

- పాటించకపోతే చర్యలు తప్పవు
- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సిద్దిపేటరూరల్: గురుకుల, సంక్షేమ వసతి గృహాల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని, పాటించాలని అధికారులను సస్పెండ్ చేస్తానని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఎదిగేందుకు మెనూను అమలు చేయాలన్నారు. నాణ్యమైన సరుకులు సరాఫరా చేయని వారిని సైతం తొలగిస్తామన్నారు. ఆకుకూరలు, క్యారెట్ ఆహారంలో అధికంగా ఉండేలా చూడాలన్నారు. స్నాక్స్ మెనూ ప్రకారం పండ్లను అందించాలన్నారు. ప్రతీ గురుకులంలో ఆర్‌డీసీఓలు, డీసీఓలు రాత్రి వేళ నిద్ర చేయాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్ఓ, ఇంచార్జీ బీసీ అభివృద్ధి అధికారి నాగరాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రణాళికతో బడ్జెట్‌ను రూపొందించండి

వచ్చే ఆర్థిక సంవత్సరానికి అన్ని మున్సిపాలిటీల్లో ప్రత్యేక ప్రణాళికతో బడ్జెట్‌ను రూపొందించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కమిషనర్లు, మెప్మా, మున్సిపల్ ఇంజనీర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా మున్సిపల్ ఆదాయ వనరులైన ఇన్‌కంట్యాక్స్, ప్రాపర్టీ ట్యాక్స్, ఇతరత్రా గ్రాంట్‌లను అన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. వచ్చిన ఆదాయం లో మున్సిపల్ సిబ్బంది జీతాలు, ఎలక్ట్రిసిటీ బిల్, వాటర్ సప్లయ్, శానిటేషన్ పనులతో పాటు తప్పనిసరిగా బడ్జెట్‌లో 10శాతం గ్రీన్ బడ్జెట్ కోసం పెట్టాలన్నారు. మున్సిపాలిటీలలో పన్ను వసూళ్లను మార్చి 15వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీలలో అక్రమంగా నిర్మించిన కట్టడాలపై దృష్టి సారించాలని, అన్ని వివరాలు పరిశీలన చేసి నిజనిర్ధారణ జరిగితే కూల్చివేత సైతం జరపాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు ఆశ్రిత్ కుమార్, మల్లికార్జున్, నర్సయ్య, శ్రీనివాస్ రెడ్డి, నాగేందర్, పబ్లిసిటీ హెల్త్ డీఈలు మహేష్, ప్రేరణ, మెప్మ పీడీ హన్మంతు రెడ్డి, ఏఈ, ఆర్‌ఐ లు తదితరులు పాల్గొన్నారు.

‘మీ సేవ’లో నిబంధనలు పాటించాలి

సిద్దిపేటరూరల్: నిబంధనలకు అనుగుణంగా మీసేవ కేంద్రాలను నిర్వహించాలని మేనేజర్ ఆనంద్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని మీ సేవ కేంద్రాల్లో చేపడుతున్న వివిధ సర్వీసు నమోదు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీసేవ సర్వీసులకు నిర్ణీత రుసుం చెల్లించి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అధిక రుసుము వసూలు చేస్తే జిల్లా కార్యాలయంలో, 1100 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నిరసన



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

సిద్దిపేటఅర్బన్: కార్పొరేట్ శక్తులకు మేలు కలిగించేలా ఉన్న కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. బుధవారం సిద్దిపేటలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాలస్వామి మాట్లాడుతూ రైతాంగానికి సంబంధించిన బడ్జెట్ అంటూనే కేటాయింపుల్లో కోత పెట్టారన్నారు. వ్యవసాయ రంగానికి తగిన విధంగా నిధులు కేటాయించలేదన్నారు. ఉపాధి హామీ పథకానికి సైతం అరకొరగా కేటాయింపులు చేశారని ఆరోపించారు. సవరించి ప్రజానుకూల బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, సత్తిరెడ్డి, భాస్కర్, వెంకట్, యాదగిరి, అరుణ్‌కుమార్, బాలనర్సయ్య, నవీన, శారద, కృష్ణారెడ్డి, ప్రశాంత్, రంజిత్‌రెడ్డి, సంజీవ్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం

జయంతి వేడుకల్లో వక్తలు

సిద్దిపేటజోన్: యువత ఛత్రపతి శివాజీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని వక్తలు అన్నారు. శివాజీ జయంతి సందర్భంగా హిందూ వాహిని ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. శివాజీ చౌక్ వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీ స్వామీజీ మాట్లాడారు. ప్రతి వ్యక్తి శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అంతకు ముందు అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ చరిత్ర భవిష్యత్తు తరాలకు తెలిసేలా చేద్దామన్నారు. ప్రపంచానికి జ్ఞానం ఇచ్చింది మన భారతదేశమన్నారు. శివాజీ పోరాట పటిమ నేర్చుకోవాలని ప్రపంచ వ్యాప్తంగా దేశాలు తమ సైనికులకు చెబుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో బీఎమ్మెస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్, జిల్లా హిందూ వాహిని అధ్యక్షుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.





పట్టణంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కమలానంద భారతీ

క్లుప్తంగా

సిద్దిపేట రూపురేఖలు మారిపోయాయి

- 50 ఏళ్ల తర్వాత మళ్లీ పురిటిగడ్డకు
- సంతోషంగా ఉంది: సీనియర్ సిటిజన్లు



మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్లు

సిద్దిపేటజోన్: యాభై ఏళ్ల కిందట ఉన్న సిద్దిపేటకు ప్రస్తుతం చూస్తున్న దానికి చాలా వ్యత్యాసం ఉందని, అభివృద్ధి చెంది రూపురేఖలే మారిపోయాయని సిద్దిపేట సీనియర్ సిటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ మిత్రులుగా చాలా సంతోషంగా ఉందన్నారు. సిద్దిపేట పట్టణంలో బాల్యం, విద్యాభ్యాసం పూర్తి చేసుకొని విదేశాల్లో ఏళ్ల కొద్ది జీవించిన తర్వాత సిద్దిపేట రావడం జరిగిందన్నారు. సిద్దిపేట పట్టణం అభివృద్ధి చెందడంతో రోల్ మోడల్‌గా ఉందన్నారు. మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రత్యేక శ్రద్ధతో సిద్దిపేట ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. ఈ సందర్భంగా వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనంతరం రంగనాయక, మల్లన్న సాగర్, కోమటిచెర్వు సందర్శించారు. సమావేశంలో సికిందర్, హమీద్, నజీమ్, కలిమ్‌తో పలువురు పాల్గొన్నారు.

పరిశ్రమలో అగ్ని ప్రమాదం

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి



ప్రమాదస్థలిని పరిశీలిస్తున్న డీఎస్పీ

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని రంగాయపల్లి శివారులో గల ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమలో బుధవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమ బట్టిలోంచి వచ్చే వేస్టేజ్‌ను ఒక పక్కన వేయగా వేడికి అక్కడ మంటలు చెలరేగి పక్కన్న ఉన్న స్టోర్ రూమ్ దగ్ధమైంది. ఇది గమనించిన యాజమాన్యం, స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి మంటలార్పారు. కార్మికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి పరిశ్రమ వద్దకు చేరుకొని కార్మికులతో మాట్లాడారు. వీరి వెంట తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్ ఉన్నారు. పరిశ్రమలో జరిగే ప్రమాదాల వల్ల గ్రామానికి ముప్పు పొంచి ఉందని రంగాయపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళ్లలో కారం కొట్టి

- మహిళ మెడలోంచి బంగారం చోరీ

పటాన్‌చెరు టౌన్: కిరాణా షాపు నిర్వాహకురాలు కళ్లలో కారం కొట్టి గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోంచి బంగారం లాక్కెళ్లిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని తులసీవనం కాలనీలో రమ్య అనే మహిళ కిరాణా షాపు నడుపుతుంది. మూడు రోజుల నుంచి ఓ వ్యక్తి కిరాణా షాపునకు తెల్లవారుజామున వచ్చి సామగ్రి తీసుకెళ్తున్నాడు. బుధవారం ఉదయం బైక్‌పై మాస్క్ ధరించి కిరాణా షాపునకి వచ్చాడు. ఉల్లిపాయలు కావాలని అడుగడంతో రమ్య తీస్తుండగా ఆమె కళ్లల్లో కారం కొట్టి మెడలో నుంచి పుస్తెలతాడు లాగే ప్రయత్నం చేశాడు. ఆమె గట్టిగా పట్టుకోవడంతో విరిగిన అరతులం బంగారంను లాక్కొని పారిపోయాడు. ఈ ఘటనపై షాపు నిర్వాహకురాలు రమ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అధికారుల నిర్లక్ష్యమే రైతులను ముంచేను



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు కోహెడ గ్రామానికి చెందిన మంద శంకర్. ఐదెకరాల్లో పత్తి సాగు చేసి అందులోనే కంది పంట వేశాడు. 10 క్వింటాళ్ల వరకు కందులు దిగుబడి రావడంతో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌కి అమ్మకానికి తీసుకెళ్లాడు. అధికారులు ఆన్‌లైన్‌లో పంట వివరాలు నమోదు కాలేదని కందులు కొనలేమని చెప్పారు. ఏం చేయాలో పాలుపోని శంకర్ మార్కెట్‌లో పోసిన కందులను బయట వ్యాపారికి క్వింటాల్‌కు రూ.6,000 చొప్పున నష్టానికి అమ్ముకొని వెళ్లాడు.



గాంధీనగర్‌లో తెగులు సోకిన వరి పంట

క్షేత్ర స్థాయిలో పంటలు పరిశీలించని వ్యవసాయ అధికారులు

- సాగుపై రైతులకు కొరవడిన అవగాహన
- సబ్సిడీ విత్తనాలపై అందని సమాచారం
- బయట మార్కెట్‌లో కొనుగోలు
- తెగుళ్ల సమయంలో ఏం మందులు వాడాలో తెలియని పరిస్థితి
- ఆన్‌లైన్‌లో నమోదుకాని పంట వివరాలు
- సీసీఐలో అమ్ముకోలేక దళారులకు విక్రయం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. రైతులు సాగు చేసిన పంటలను అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించడం లేదు. దీంతో పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు. అలాగే విత్తన ఎంపిక, ఎరువుల వాడకం, తెగుళ్ల నివారణ సమయంలో ఎలాంటి మందులు వాడాలనేది తెలియడం లేదు.

హుస్నాబాద్ డివిజన్ అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్, బెజ్జంకి మండలాల్లో 68,272 ఎకరాల్లో పంటలు సాగు చేయగ అందులో వరి 53,280, మొక్కజొన్న 12,782, పొద్దుతిరుగుడు 1660, వేరుశనగ 150, ఇతర పంటలు 400 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. యాసంగి సీజన్‌కు ముందు గ్రామాల్లో అవగాహన కల్పించలేక రైతులు వారికి నచ్చిన పంటలను సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంతం సాగు నీరు కష్టాలను తప్పించుకొనేందుకు కూడా రైతులు వరి తగ్గించి మొక్కజొన్న పంటను పెంచారు. ప్రైవేటు సీడ్ విత్తన కంపెనీలు గ్రామాలకు రావడంతో వారి దగ్గర విత్తనం తీసుకొని పంట సాగు చేస్తున్నారు. పంటల దిగుబడులు విత్తన కంపెనీలు గ్యారంటీ ఇవ్వకపోవడం, కొనుగోలు చేసిన వెంటనే డబ్బులు చేతుకు రాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎక్కువ దిగుబడులు వస్తాయనే ఆశ రైతులను విత్తన కంపెనీల వైపు చూస్తున్నారు. గాంధీనగర్, తోటపల్లి, చౌటపల్లి గ్రామాల్లో మొక్కజొన్న పంటలను సాగు చేసిన రైతులు విత్తనం మొలువకపోవడంతో విత్తనం చెడగొట్టి లోకల్ విత్తనం వేసుకొన్నారు. దీంతో రైతలకు పెట్టుబడుల భారం పెరిగింది, సమయం వృథా అయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ సబ్సిడీ విత్తన వెనక్కి..

ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నేషనల్ సీడ్ కార్పొరేషన్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల రైతుల కోసం 18 క్వింటాళ్ల హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనం సరఫరా చేసింది. 10 కిలోల విత్తనం ఖరీదు రూ.275 ఉంటే రూ.100 సబ్సిడీ పోను రైతులు రూ.175 చెల్లించాలి. రైతులకు అధికారులు అదును దాటిన తర్వాత సమాచారం ఇవ్వడంతో అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో ఒక రైతు కూడా విత్తనం తీసుకోలేదు. కోహెడ, బెజ్జంకి మండలాల్లో 8 క్వింటాళ్ల విత్తనాలను రైతులు తీసుకొని సాగు చేశారు. ప్రభుత్వం విత్తనం సరఫరా చేస్తుందని రైతులకు అధికారులు చెప్పకపోవడంతో రైతులు ప్రైవేటు కంపెనీల విత్తనాలను కొనుగోలు చేసి పంటలు సాగు చేశారు.

వేధిస్తున్న ఆన్‌లైన్ సమస్య..

వ్యవసాయ అధికారులు క్లస్టర్ పరిధిలోని గ్రామాలకు వెళ్లి రైతులకు విత్తన ఎంపిక, ఎరువుల వాడకం, తెగుల్ల నివారణ పై అవగహన కల్పిస్తే మంచి దిగుబడులు తీస్తారు. క్షేత్ర స్థాయికి వెళ్లిన అధికారులకు రైతులు ఏ పంటలు వేశారనే విషయాలు కూడా తెలుసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం సులభమవుతుంది. పంటల క్షేత్రాలకు వెళ్లని అధికారులు ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు లేక పంటలు విక్రయించడానికి మార్కెట్‌కు వెళ్తే ఆన్‌లైన్ సమస్యలను ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాలకు వచ్చి పంటలను ఆన్‌లైన్ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రెండు ఎకరాలను చెడగొట్టిన



హైబ్రిడ్ సీడ్ మక్క అంటే ఉత్తర కార్తెల దుక్కిపోతం చేసి విత్తనం పెట్టిన. విత్తనాలు సరిగాలేక మక్క మొలువలేదు. రెండు ఎకరాల మక్క చేను దున్ని మళ్లీ దుకాణానికి వెళ్లి లోకల్ మక్క తెచ్చి పెట్టిన. రూ.15 వేలు ట్రాక్టర్ దున్నకానికి అయ్యింది. మక్కలు పెట్టి పెట్టుబడి ఖర్చు నష్టపోయిన. మా భూమి దగ్గరనే ఏడీఏ ఆఫీసు ఉంటదని, అయినా ప్రభుత్వం సబ్సిడీ విత్తనం వచ్చిందని చెప్పలేదు.

– పోలు మహేందర్, రైతు గాంధీనగర్

పంటల వద్దకు వెళ్లాలని ఆదేశించాం



డివిజన్ పరిధిలోని వ్యవసాయ క్లస్టర్ల వారీగా ఏఈఓలను పంటల క్షేత్రాలకు వెళ్లాలని ఆదేశించాం. పంటల తెగుళ్ల నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించాలని చెప్పాం. ఆన్‌లైన్ నమోదు కూడా చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ నాసిరకం ఉందని రైతులు వద్దంటే తిరిగి పంపించాం. కోహెడ, బెజ్జంకి రైతులు మొక్కజొన్న సాగు చేసుకున్నారు.

– శ్రీనివాస్, ఏడీఏ, హుస్నాబాద్

స్రవంతి.. ప్రాజెక్టుతో సత్తా చాటి

- అంతర్జాతీయ ప్రదర్శనకు ఎంపికైన 'డెస్క్ లిఫ్టర్'
- తక్కువ ఖర్చు, తేలికైన వస్తువులతో రూపకల్పన చేసిన విద్యార్థిని
- సులువుగా గదులు శుభ్రం చేసేందుకు ఉపయోగం



'డెస్క్ లిఫ్టర్' ప్రాజెక్టుతో విద్యార్థిని స్రవంతి

జోగిపేట(అందోల్): ప్రతి రోజూ కళ్ల ముందే అంగవైకల్యంతో ఉన్న స్వీపర్ తరగతి గదిని శుభ్రం చేస్తూ పడుతున్న ఇబ్బందులు చూసి ఆ విద్యార్థినిని తన ఆలోచనకు పదును పెట్టింది. ఈ ఇబ్బందిని ఎలాగైన దూరం చేయాలని సులభంగా గదిని శుభ్రం చేసే విధంగా ఓ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేసింది. రెండు, మూడు మాసాలు కష్టపడి 'డెస్క్ లిఫ్టర్' అనే ప్రాజెక్ట్‌ను తయారు చేయడమే కాకుండా అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది.

సంగారెడ్డి జిల్లా అందోలు మండలం కన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన అతిపేద కుటుంబానికి చెందిన ఆశం యాదయ్య, కవితల మూడవ కూతురు స్రవంతి. జోగిపేటలోని ఎస్ఆర్ఎమ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. పాఠశాలలో పని చేస్తున్న సైన్స్ టీచర్ సిద్దేశ్వర్ సహకారంతో 2023లో 'డెస్క్ లిఫ్టర్' అనే ప్రాజెక్టుకు తయారు చేసింది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఈ ప్రాజెక్టు ప్రదర్శించారు. అక్కడ అందరినీ ఆకట్టుకొని హైద్రాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర ప్రదర్శనకు ఎంపికైంది. 2024వ సంవత్సరం సెప్టెంబర్ మాసంలో ఢిల్లీలో జరిగిన 11వ నేషనల్ సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డు ప్రదర్శనలో ప్రాజెక్టుకు ప్రశంసలు దక్కాయి. అంతే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో 2025 జూన్‌లో జపాన్‌లో నిర్వహించే అంతర్జాతీయ ప్రదర్శనకు ఎంపిక చేశారు. జపాన్ ప్రదర్శనకు జాతీయ స్థాయిలో 60 ప్రాజెక్టులు, రాష్ట్ర స్థాయిలో నాలుగు ప్రాజెక్టులు ఎంపిక కాగా వాటిలో కన్సాన్‌పల్లి విద్యార్థిని రూపొందించిన 'డెస్క్ లిఫ్టర్' ప్రాజెక్టు ఒకటి కావడం విశేషం. అతి తక్కువ ఖర్చుతో, తేలికైన వస్తువులతో ఎక్కడికైనా అవలీలగా తీసుకువెళ్లే విధంగా 'డెస్క్ లిఫ్టర్' ప్రాజెక్టును రూపొందించారు. పాఠశాలలు, ఆఫీసులు, ఇతర కార్యాలయాల్లో గదులు శుభ్రం చేయడానికి దీన్ని వాడొచ్చు.

సంతోషంగా ఉంది



డెస్క్ లిఫ్టర్ ప్రాజెక్టు తయారు చేసే సమయంలో జిల్లా, రాష్ట్ర స్థాయి గుర్తింపు వస్తే చాలనిపించేది. కానీ భారత ప్రభుత్వం ద్వారా జపాన్‌లో జరిగే ప్రదర్శనకు ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉంది. జూన్‌లో జపాన్ వెళ్లేందుకుగాను అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నాను. పాస్‌పోర్టును కూడా సిద్ధం చేసుకున్నాను. ఈ అనుభూతిని జీవితంలో మరచిపోను.

– స్రవంతి, విద్యార్థి, కన్సాన్‌పల్లి

జాతీయ స్థాయిలో గుర్తింపు



డెస్క్ లిఫ్టర్ అనే పరికరాన్ని ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. ఈ ప్రాజెక్టు ద్వారా స్కూళ్లు, ఆఫీసులు, ఆస్పత్రుల్లో టేబుళ్లని లేపి చక్కగా శుభ్రం చేయొచ్చు. 2025 జూన్ మాసంలో జపాన్ రాష్ట్రంలోని సకూరలో జరిగే ప్రదర్శనకు భారతదేశ ప్రభుత్వం ఎంపిక చేసింది. గతేడాది కన్సాన్‌పల్లి పాఠశాల నుంచి 'పింక్ లూ' ప్రాజెక్టు తరపున భూమిక జపాన్ ప్రదర్శనకు వెళ్లింది.

– సిద్దేశ్వర్, గైడ్ టీచర్, కన్సాన్‌పల్లి

సమస్యల పరిష్కారంపై సీఎం హామీ

- ఉద్యోగులతో మార్చిలో ప్రత్యేక సమావేశం
- టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వర్

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై మార్చి మొదటి వారంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పరిష్కార చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం సీఎంని హైదరాబాద్‌లో కలిసి కరీంనగర్ వెళ్తూ మార్గమధ్యలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డికి వివరించి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని, పెన్షన్ బెనిఫిట్స్ రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన సీఎం సీనియార్టీ ప్రకారం చెల్లింపు జరిగేలా చూస్తామని, ఏప్రిల్‌లో డీఏలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఉద్యోగుల అన్ని సమస్యలపై మార్చి మొదటి వారంలో ప్రత్యేకంగా సమీక్ష చేస్తానని సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నారని సీఎంకు వివరించినట్లు తెలిపారు. ఎల్బీ స్టేడియంలో భారీ స్థాయిలో త్వరలో ఉద్యోగుల సమావేశం ఉంటుందని, టీఎన్జీవో ప్రతినిధులు రావాలని సూచించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య



వెంకటేశ్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వర్గల్ మండలం గౌరారంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. చింత వెంకటేశ్(30), రమ్య దంపతులు గౌరారంలో నివాసం ఉంటున్నారు. ప్రైవేటు ఉద్యోగం చేసే వెంకటేశ్ తనకు తెలిసిన వారి నుంచి రూ. 5 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ డబ్బులు తిరిగి చెల్లించే మార్గం లేక భార్యతో చెప్పుకుంటూ ఆవేదన వ్యక్తం చేసేవాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెంది మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక డంప్ స్వాధీనం

కొండపాక(గజ్వేల్): అక్రమంగా డంప్ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకోవడంతోపాటు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి మెరుగు రమేశ్ కొంత కాలంగా రహస్య ప్రదేశాల్లో అక్రమంగా ఇసుకను డంప్ చేసుకుంటూ ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కుకునూరుపల్లి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 50 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను, మట్టిని, మొరం, రేషన్ బియ్యాన్ని రవాణా చేసే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఈశ్వర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఈశ్వర్ అన్నారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బహుజన్ సమాజ్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకి ఓటు వేసి గెలిపిద్దామని, బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఈశ్వర్ అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలో బుధవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసి ఎంతో మంది పేదలకు బాసటగా నిలిచిన ప్రసన్న హరికృష్ణను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శ్రీరామ్‌కృష్ణ, లింగంపల్లి యాదగిరి, వెంకట్, వెంకటేశ్వర్లు, ఓం ప్రకాష్, శంకర్, నరేష్, పుల్లూరు ఉమేష్, రాజు, సంపత్, బాబు, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో..

సిద్దిపేటకమాన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారుడు రవీంద్రసింగ్‌ను గెలిపించాలని శాతావాహన జేఏసీ చైర్మన్ వ్యవస్థాపకుడు చైతన్య కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు విద్యావ్యాపారవేత్తలకు, విద్యావంతులకు జరుగుతున్న ఎన్నిక అన్నారు. అందరూ కూడా ఆలోచించి ఓటు వేయాలని, ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నరేష్, అశోక్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విహార యాత్ర

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం విహారయాత్రకు వెళ్లారు. చంద్లాపూర్ శివారులోని రంగనాయకస్వామి గుట్ట, రంగనాయకస్వామి రిజర్వాయర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సరదాగా గడిపారు. రిజర్వాయర్ ప్రాముఖ్యత, దేవాయలం విశిష్టత గూర్చి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు సురేశ్‌కుమార్, వర ప్రసాద్, లలిత, సునీత, వాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

నంగునూరు(సిద్దిపేట): దేశ్‌పాండే ఫౌండేషన్ (కాకతీయ శాండ్ బాక్స్) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పెల్‌బీ పోటీల్లో నంగునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. మంగళవారం నిజామాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పెల్‌బీ-25 పోటీలో రాష్ట్ర వ్యాప్తంగా 40 పాఠశాలల నుంచి 3 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. 25 నిమిషాల్లో 50 పదాలకు 47 పదాలను స్పెల్లింగ్ మిస్టేక్ లేకుండా రాసి 6వ తరగతి విద్యార్థి భార్గవ్ ప్రథమ బహుమతి సాధించాడు. ఏడవ తరగతి విద్యార్థి హస్రిత తృతీయ బహుమతి సాధించగా, యశ్వత్‌కు ప్రశంసాపత్రం అందజేశారు. వీరికి నిజామాబాద్ జిల్లా డీఈఓ అశోక్‌కుమార్ సర్టిఫికెట్లను అందజేశారు. దీంతో హెచ్ఎం రామస్వామి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగులు ఈ నెలాఖరు వరకు లైఫ్ సర్టిఫికెట్లను సంబంధిత ట్రెజరీ కార్యాలయములలో సమర్పించాలని, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి బుధవారం తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు మీసేవా కేంద్రంలో, పోస్టల్ డిజిటల్ పేమెంట్ ద్వారా మ్యాన్యువల్‌గా సమర్పించాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ హనుమాన్‌నగర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ సరఫరా లైన్‌ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముర్షద్‌గడ్డ, సాయిబాబా ఆలయం, గణేష్‌నగర్, ఏరియా ఆస్పత్రి ఏరియా, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం తోటపల్లిలో బుధవారం ఇందిరమ్మ ఇంటికి లబ్ధిదారులు భూమిపూజ చేసుకున్నట్లు మార్కెట్ వైస్ చైర్మన్ చందు తెలిపారు. మండలంలో తోటపల్లి గ్రామంలో దాదాపు వందశాతం పేదలకు 120 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. తోటపల్లిని వందశాతం అభివృద్ధి పనులు చేసి ఆదర్శంగా నిలుపుతామన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

- కల్లు తాగేందుకు వచ్చి ఈతకు వెళ్లిన యువకులు
- ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి
- జిన్నారం మండలంలోని వావిలాల పీర్ల చెరువు వద్ద ఘటన



నరేశ్, శంకర్ మృతదేహాలు

జిన్నారం (పటాన్‌చెరు): చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన జిన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ నాగలక్ష్మి కథనం ప్రకారం.. మేడ్చల్ జిల్లా గాగిల్లాపూర్‌కు చెందిన వల్లపు రాంబాబు కుమారుడు నరేశ్(26), వల్లపోలు రాజు కుమారుడు శంకర్ (22) ఇద్దరూ స్నేహితులు కాగా కూలీ పని చేస్తుంటారు. మంగళవారం సాయంత్రం జిన్నారం మండలం వావిలాలలో కల్లు తాగేందుకు స్కూటీ పై వచ్చారు. తిరిగి వెళ్లే సమయంలో ఈత కొట్టేందుకు వావిలాల పీర్ల చెరువులోకి దిగారు. చెరువు ఎక్కువ లోతు ఉండడంతో ప్రమాదవశాత్తు మునిగిపోయారు. అక్కడే గేదెలు మేపే ఓ వ్యక్తి గమనించి చెరువులో దిగి కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. వెంటనే పోలీసులకు విషయం చెప్పాడు. బుధవారం జగంపేట వావిలాల గ్రామాలకు చెందిన ఈతగాళ్ల సాయంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా మధ్యాహ్నం మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ మేరకు జిన్నారం పోలీసులు కేసు నమోదు చేశారు.

శుభకార్యానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి

బైకును ఢీకొట్టిన టిప్పర్: యువకుడు దుర్మరణం



ప్రకాశ్ (ఫైల్)

కొండాపూర్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. కొండాపూర్ ఎస్ఐ హరీశ్ కథనం మేరకు.. మారేపల్లి గ్రామానికి చెందిన గంజాయి ప్రకాశ్ (28) బంధువుల శుభకార్యం నిమిత్తం మూడు రోజుల కిందట మండల పరిధిలోని మల్కాపూర్‌కు వచ్చాడు. బుధవారం ఉదయం కార్యక్రమం కోసం కొన్ని వస్తువులను కొనుగోలు చేసేందుకు బైక్‌పై బంధువైన జేమ్స్‌తో కలిసి సంగారెడ్డికి వచ్చాడు. తిరిగివెళ్తున్న క్రమంలో మల్కాపూర్ గ్రామ శివారు వద్దకు చేరుకోగానే వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రకాశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు గంజాయి ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

న్యాల్‌కల్(జహీరాబాద్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని హుస్సెల్లి చెక్ పోస్టు వద్ద చోటు చేసుకుంది. హద్నూర్ పోలీసుల కథనం మేరకు.. మండలంలోని శంశల్లాపూర్ గ్రామానికి చెందిన ప్రభు(31) మంగళవారం రాత్రి హుస్సెల్లి చౌరస్తా నుంచి కాలి నడకన ఇంటికొస్తున్నాడు. చెక్ పోస్టు వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పున్నెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శివాజీ జయంతి ఉత్సవాల్లో అపశృతి

- జెండావిష్కరణ చేస్తుండగా ఏడుగురికి విద్యుత్ షాక్
- ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- వర్గల్ మండలం జబ్బాపూర్‌లో విషాదం



మృతదేహం వద్ద విలపిస్తున్న ప్రశాంత్ తల్లి

వర్గల్(గజ్వేల్): ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. వర్గల్ మండలం జబ్బాపూర్‌లో జెండావిష్కరణ చేస్తుండగా విద్యుత్ తీగలు ఇనుప జెండా పైపునకు తగిలి ఏడుగురికి కరెంట్ షాక్ కొట్టింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఆరుగురికి గాయాలయ్యాయి. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా జబ్బాపూర్ గ్రామ కూడలిలో యువకులు, గ్రామస్తులు ఇనుప పైపుతో కూడిన కాషాయజెండాను ఎగుర వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఉదయం 11.30 ప్రాంతంలో జెండాను పైపు చివరన బిగించారు. లింగ ప్రశాంత్(22), దేశెట్టి కరుణాకర్(22), పల్లపు బన్నీ, కొంతం వేణు, కొంతం కనకరాజు, లింగ గణేష్, లింగ మహేశ్ జెండా పైపును పట్టుకొని పైకి లేపుతుండగా ప్రమాదవశాత్తు పైనున్న కరెంట్ తీగలకు తగిలింది. దీంతో పైపును పట్టుకున్న వారందరూ విద్యుత్ షాక్‌కు గురై పడిపోయారు. షాక్ తీవ్రతకు లింగ ప్రశాంత్ మృతి చెందగా, దేశెట్టి కరుణాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితులను గ్రామస్తులు చికిత్స నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కరుణాకర్‌ను మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనతో జబ్బాపూర్ గ్రామం శోకసంద్రమైంది. చేతి కందిన కొడుకు విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడటంతో ప్రశాంత్ తల్లి కనకమ్మ రోదనలు మిన్నంటాయి. ఒంటరిని చేసి పోయావా అంటూ ఆమె విలపిస్తుంటే ఆపడం ఎవరితరం కాలేదు. డిగ్రీ చదువులో మిన్నగా, ఎన్‌సీసీలో గ్రూప్ లీడర్‌గా ప్రశాంత్ రాణించాడు. మిన్నంటిన రోదనల మధ్య అతడి అంత్యక్రియలు ముగిశాయి.



ప్రశాంత్(ఫైల్)